ఓటమి భయంతోనే

# నాపై తుమ్మల అసత్య ప్రచారం

**శివాయిగూడెం ఎన్నికల ప్రచారంలో మంత్రి అజయ్‌కుమార్**



రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్

రఘునాథపాలెం, నవంబర్ 16: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఓటమి భయంతోనే తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ మండిపడ్డారు. మండల పరిధిలోని శివాయిగూడెంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. గతంలో ఓడిపోయిన తుమ్మల, ఈ సారి కూడా ఓడిపోతారనే ఆందోళనలో నియోజకవర్గ అభివృద్ధిపై చిల్లర మాటలు మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణ వస్తే రాష్ట్రంలో చిమ్మచీకట్లు అలుముకుంటాయని నాటి సీమాంధ్ర పాలకులు జోస్యం చెప్పారని, కానీ సీఎం కేసీఆర్ ఇప్పుడు 24 గంటల పాటు కరెంట్ ఇస్తూ వారికి చెంప పెట్టులాంటి సమాధానం ఇచ్చారన్నారు. గత పాలకుల హయాంలో రైతులు ఎరువులు, విత్తనాల కోసం క్యూలో నిలబడి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత రైతులు సునాయాసంగా ఎరువులు, విత్తనాలు తెచ్చుకుంటున్నారన్నారు. ఇతర పార్టీల నాయకులు ప్రచారంలో భాగంగా ఓట్లడిగితే, తమ హయాంలో ఏం మంచి చేశారో.. నిలదీయాలన్నారు. ప్రచారంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జడ్పీటీసీ మాళోతు ప్రియాంక, వైస్ ఎంపీపీ గుత్తా రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజ్మీరా వీరూ నాయక్, సర్పంచ్ చెరుకూరి ప్రదీప్, నాయకులు మందడపు నర్సింహారావు, మందడపు సుధాకర్ పాల్గొన్నారు.

## మద్యం నియంత్రణకు పకడ్బందీగా చర్యలు

**ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ కమిషనర్ జి.గణేష్**

మామిళ్లగూడెం, నవంబర్ 16: అసెంబ్లీ ఎన్నికలపై మద్యం ప్రభావం ఉండకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ కమిషనర్ జి.గణేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు రూ.3,02,400 విలువ గల 756 లీటర్ల గుడుంబా, రూ.1,50,20,000 విలువ గల 1,50,200 లీటర్ల ఎఫ్.జె. వాష్, రూ.5,24,000 విలువ గల 1,310 కిలోల నల్ల బెల్లం, రూ.2,25,900 విలువ గల 3,012 లీటర్ల టాడీ, రూ.42,62,500 విలువ గల 3,875 లీటర్ల ఐఎంఎల్, రూ.2,47,250 విలువ గల 989 లీటర్ల బీర్, రూ.89,100 విలువ గల 74.25 లీటర్ల ఎన్డీపీఎల్, రూ.1,01,50,000 విలువ గల 406 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. భద్రాద్రి జిల్లాలో ఇప్పటివరకు రూ.11,16,580 విలువ గల 2792 లీటర్ల గుడుంబా, రూ.1,88,88,000 విలువ గల 1,50,200 లీటర్ల ఎఫ్.జె. వాష్, రూ.4,24,000 విలువ గల 1,060 కిలోల నల్ల బెల్లం, రూ.6000 విలువ గల 80 లీటర్ల టాడీ, రూ.13,95,350 విలువ గల 1,269 లీటర్ల ఐఎంఎల్, రూ.34,613 విలువ గల 139 లీటర్ల బీర్, రూ.76,11,250 విలువ గల 305 కిలోల గంజాయి, రూ.11,500 విలువ గల 0.023 లీటర్ల హేషిస్ ఆయిల్, రూ.24,00,000 లక్షల విలువైన 32 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా రూ.6,32,18,443 విలువ గల మద్యం, గంజాయితో పాటు ఇతర మాదకద్రవ్యాలు, వాటిని తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, నవంబర్ 16: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వెదుళ్లచెరువు డొంక వద్ద చోటుచేసుకున్నది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పిండిప్రోలు పంచాయతీ శివారు గ్రామం పాపాయిగూడేనికి చెందిన రేపాకుల రాజు(45) గురువారం బైక్‌పై పిండిప్రోలు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మరిపెడ బంగ్లా వైపు నుంచి ఖమ్మం వెళ్తున్న కారు మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి బైక్‌ను ఢీకొట్టి రోడ్డు కిందకు వెళ్లింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న రాజు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ సంభాని చంద్రశేఖర్ పరామర్శించారు. అలాగే కారులో ప్రయాణిస్తున్న ఓ మహిళ స్వల్ప గాయాల పాలైంది. క్షతగాత్రురాలిని స్థానికులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## ప్రజలు ఆశీర్వదిస్తే

# ‘మధిర’ రూపురేఖలు మారుస్తా



ప్రజలు ఆశీర్వదిస్తే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి మధిర నియోజకవర్గ రూపురేఖలు మారుస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. వచ్చిన పదవిని హోదాగా కాకుండా బాధ్యతగా భావిస్తానన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఆయన ‘నమస్తే’తో కాసేపు ముచ్చటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజల మధ్యకు వెళ్తున్నానని, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్నానని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిపై తన విజన్‌ను పంచుకున్నారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

**-ఖమ్మం, నవంబర్16**

**(నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

- **అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా..**
- **నిత్యం అందుబాటులో ఉంటా..**
- **దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలపై దృష్టి సారిస్తా**
- **‘నమస్తే’తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్ రాజు**

మధిర నియోజకవర్గ ప్రజలు నియోజకవర్గంలో ఉంటూ, వారికి అందుబాటులో ఉండే నాయకుడిని కోరుకుంటున్నారు. నేను గత ఎన్నికల్లో ఓటమి పాలైనా సీఎం కేసీఆర్ నాకు జడ్పీ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. జడ్పీ చైర్మన్‌గా నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పని చేశాను. వచ్చే ఎన్నికల్లో ప్రజలు నన్ను గెలిపిస్తే శాసనసభలో మధిర ప్రజల సమస్యలు మాట్లాడతా. వారి తరపున వారి వాణిని వినిపిస్తా. నియోజకర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పటికే ఎంతో అధ్యయనం చేశాను. అధ్యయనం చేసే అలవాటు నాకు విద్యార్థి దశ నుంచే ఉన్నది. సమస్య ఎక్కడ ఉంటే అక్కడ కమల్‌రాజు ఉంటాడని ఇప్పటికే నాకు పేరున్నది. ముందు నుంచి నాలో పోరాట పటిమ ఉన్నది. సామాన్యుడిగా మొదలైన నా ప్రయాణం ఇక్కడి వరకు వచ్చింది. నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలందరూ ప్రజల సమస్యలను పట్టించుకోలేదు. వీరిలో నియోజకవర్గంలో అందుబాటులో ఉండని నేతలే ఎక్కువ. అందుకే ప్రజలు శాసనసభ్యుడంటే స్థానికంగా అందుబాటులో ఉండని వ్యక్తి అనే భావనలో ఉన్నారు.

**ప్రజలే గెలిపిస్తారు..**

వచ్చే ఎన్నికలు మధిర నియోజకవర్గానికి మంచి రోజులు తీసుకొస్తాయి. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌పై ఇక్కడి ప్రజలకు ఆదారాభిమానాలు ఉన్నాయి. అదే అభిమానంతో ప్రజలు నన్ను ఎన్నికల్లో గెలిపిస్తారు. ప్రజలు నన్నెప్పుడూ పెత్తనం చలాయించే వ్యక్తిగా చూడలేదు. స్నేహితుడిలా, తమ ఇంటి బిడ్డలా చూశారు. జడ్పీ చైర్మన్‌గా బాధ్యతగా పనిచేసి వారి నమ్మకాన్ని పొందాను. ప్రభుత్వం నుంచి ఎలాంటి అవకాశం వచ్చినా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశాను.

**ప్రణాళికలు ఇవీ..**

నేను ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయితే ఖమ్మం- బోనకల్లు రోడ్డును నాలుగులైన్ల రహదారి చేస్తా. ముదిగొండ, బోనకల్లు, ఎర్రుపాలెం, చింతకాని, మధిర మండలాల్లో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తా. సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మంగా గోదావరిపై సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నారు. ప్రాజెక్ట్ పనులు పూర్తయితే మధిర రైతాంగానికి మేలు జరుగుతుంది. ఇప్పటివరకు జిల్లాకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి వచ్చే కృష్ణా జలాలే ఆధారం. సీతారామ ప్రాజెక్ట్ పూర్తయితే గోదావరి జలాలూ తరలివస్తాయి. నియోజకవర్గం గోదావరి, కృష్ణా నదుల సంగమంగా మారనున్నది. ప్రజలు నిండు మనసుతో నన్ను ఎన్నికల్లో గెలిపించాలని కోరుకుంటున్నాను. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా. నన్ను కలవాలంటే ప్రజలకు మధ్యవర్తుల అవసరం ఉండదు. నా ఫోన్ నంబర్‌కు ఒక్క కాల్ చేస్తే చాలు. అర్ధరాత్రైనా స్పందిస్తా. ప్రజలకు ఆ హక్కు ఉన్నది.

# బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి

**రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర**



గులాబీ కండువా కప్పుతున్న ఎంపీ వద్దిరాజు



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 16: బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 23, 27, 33 వార్డులకు చెందిన సుమారు వెయ్యి మంది గురువారం కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎంపీ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి దిశానిర్దేశం చేశారు. ఆల్ ఇండియా ఫార్వాడ్ బ్లాక్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జలగం వెంకట్రావుకు ఓటు వేస్తే, ఆయన ఎప్పుడు ఏ పార్టీలో చేరతారో ఎవరికీ తెలియదన్నారు. సీపీఐ అభ్యర్థి సాంబశివరావు తన ఒక్క సీటు కోసం ఉద్యమ పార్టీని కాంగ్రెస్ పార్టీకి తాకట్టు పెట్టారన్నారు. అలాంటి నేత ప్రజలకు ఏం సేవ చేస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమాను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో జీడీ సాయి, భూంపల్లి చంద్రశేఖర్, మామిడిపల్లి శివ, కత్తెర నరేందర్, ఎండీ రహీం, రేవంత్, మల్లికార్జున్, దిమ్మిడి శ్రీకాంత్, ఎస్‌కే సయిద్, రజిని, ఉషా, జ్యోతి, సంధ్య, నాగమణి, సుజాత, శాంతి, సింధూజ, పద్మ, విజయ ఉన్నారు. కార్యక్రమంలో నేతలు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు, ఎడవల్లి కృష్ణ, రావి రాంబాబు, వై.శ్రీనివాస్‌రెడ్డి, చల్లా శకుంతల పాల్గొన్నారు.

**ఎంపీ వద్దిరాజు పరామర్శ**

జూలూరుపాడు, నవంబర్ 16: జూలూరుపాడుకు చెందిన నారాయణమ్మ గురువారం గుండెపోటుతో మృతిచెందింది. సమాచారం అందుకున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర వెంటనే మృతురాలి ఇంటికి చేరుకున్నారు. నారాయణమ్మ మృతదేహానికి నివాళి అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఎంపీ వెంట మున్నూరు కాపు సంఘం నాయకులు బాపట్ల మురళి, ఆకుతోట ఆదినారాయణ, చిన్నంశెట్టి రంగారావు, నారా వెంకట్, వరికూటి రామారావు ఉన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కటిక చీకట్లే..

**బయ్యారం మండల ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియ**



బీఆర్ఎస్ మ్యానిఫెస్టో వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియ

బయ్యారం, నవంబర్ 16: ఈ ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కటిక చీకట్లు ఖాయమని బీఆర్ఎస్ ఇల్లెందు నియోజకవర్గ అభ్యర్థి హరిప్రియానాయక్ స్పష్టం చేశారు. కానీ మరోసారి కూడా బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటే ఇళ్ల ముంగిట నిత్య కాంతులేనని స్పష్టం చేశారు. మానుకోట జిల్లా బయ్యారం మండలంలో గురువారం పర్యటించిన ఆమె.. మహబూబాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్యతో కలిసి వెంకట్రాంపురం, చర్లపల్లి, ఇర్సులాపురం, రామచంద్రాపురం, మొట్ల తిమ్మాపురం, అల్లిగూడెం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాయమాటలతో మభ్యపెట్టడానికి వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పాటుపడుతుంటే.. కాంగ్రెస్ , బీజేపీలు రైతులను మోసం చేస్తున్నాయని అన్నారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ నేతలు ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తాతా గణేశ్, చేపూరి మౌనిక, గంగుల సత్యనారాయణ, బానోత్ మురళీకృష్ణ, కొండ్రెడ్డి సోమిరెడ్డి, కవిత, ఏనుగుల ఐలయ్య, బానోతు లక్ష్మణ్, బానోత్ శ్రీను, రేపాకుల వెంకన్న (ఆర్‌వీ), జర్సుల శ్రీను, చెరుకుపల్లి రవి పాల్గొన్నారు.